# రెండు నాన్నలు

సాయంకాలం అయిదయింది.

ఆంజనేయ శాస్త్రి ఆఫీసరు లేకపోవం వలన హెడ్ గుమాస్తాకి చెప్పేసి రోజుకంటే గంటముందే ఇంటికి బయలుదేరాడు. ఆఫీసులో ఆ రోజు అందిన అదనపు ఆదాయం అతనికి హుషారిచ్చింది. వచ్చి నెల రోజులయినా టిక్కెట్లు దొరకని కొత్త సినిమాకి వెళ్ళాలని మనసు మొరాయించింది. సైకిలుని హాలువేపు పోనిచ్చాడు. అప్పటికే అడ్వాన్సు బుకింగ్ క్లోజయిపోవటం వలన, బ్లాక్‌లో రెండు బాల్కనీ టికెట్లు సంపాదించి, ఇంటికి హుషారుగా వెళ్ళాడు.

ఇంటికి చేరుకుని సైకిలు వరండాలో పెట్టి, సోఫాలో కూర్చుని బూట్లు విప్పుకుంటూ ఉండగా, వీధిలో నుంచి లాగుని ఎగదోసుకుంటూ వస్తున్న నాలుగేళ్ళ పుత్రరత్నం రమేషు అంజనేయశాస్త్రిని చూసి "అదీ నాన్న" అంటూ మీద పడబోయాడు. వాడి ఒంటికి పట్టిన దుమ్మును చూసి "అరె వెధవ! ఎక్కడ దొర్లావు? ఈ ఒళ్ళు ఎవిటి? ఈ దుమ్మేమిటి? ఉండు...... మీద పడకు!" ఆ రోజే తీసిన వైట్ ఫాంటు మాసిపోతుందన్న ఉద్దేశంతో కొడుకును ఒక చేత్తో పట్టుకొని దూరంగా ఉంచి, మరో చేతితో బూటు విప్పుకుంటున్నాడు. ఉన్నట్టుండి రమేషు రెండు చేతులతో చప్పట్లు కొడుతూ "అదీ....అదీ... లెండు నాన్నలు...లెండు నాన్నలు!" అని గెంతాడు. సాక్సు వూడదీసుకునేందుకు కొడుకును విడిచి పెట్టేసరికి వాడు తుర్రున ఇంట్లోకి పారిపోయాడు. సాక్సు తీసి బూట్లో దోపి, బల్ల క్రిందకి వాటిని తోస్తుంటే వాడన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"రెండు నాన్నలు!"


అంజనేయశాస్త్రికి గుండె జల్లు మంది.

"రెండు నాన్నలేమిటి!" వాడలాగ ఎందుకన్నదీ ఎంత ఆలోచించినా ఆంజనేయ శాస్త్రికి అర్థం కాలేదు.

ఇంకొక నాన్నెవరు చెప్మా? రాధ వాడికి ఇంకొకర్నెవర్నయినా నాన్న అనిచెప్పిందా? ఇంతకి వా డెందుకలా అని ఉంటాడు? అప్పుడు అంజనేయశాస్త్రిని చీల్చి చెండాడుతున్న ప్రశ్న లివి. జేవురించి పోయిన ముఖంతో ఇంట్లోకి వెళ్ళాడు. వెళ్లేసరికి, కాఫీ ఒంపేసినందుకు తల్లి కొట్టిన చెళ్ళుమన్న దెబ్బకి వాడు నేల మీద పడి ఏడుస్తున్నాడు. వా డెందు కేడుస్తుందీ కనిపిస్తున్నా.

"ఏమయిందీ? వాడినెందుకు కొట్టావ్? గయ్‌మన్నాడు భార్యమీద.

"చూస్తూ అడుగుతారేం మళ్ళీ? చిన్న



గ్లాసులో కాఫీ పోస్తే చాలదని కాలితో ఎలా తన్నాడో చూడండి! వెధవ! వీడుతో వేగలేకపోతున్నా! ఇందాక స్టౌ మీద గిన్నెను పట్టుకున్నాడు. అద్దాన్ని చెంచాతో కొట్టి విరగొట్టాడు. వీడికి బొత్తిగా భయం లేకుండా పోతూంది." వరుసగా వాడి పనులకు ఏకరవు పెట్టింది.

"వాడవన్నీ బద్దలు కొడుతుంటే నువ్వేం చేస్తున్నావ్? ను వ్వెక్కడి కెళ్ళావ్?" రెండో నాన్న మనసులో వేదిస్తుంటే సూటిగా అడగలేక వక్రంగా ప్రశ్నించాడు.

"ఎక్కడికి పోతానండీ వల్లకాట్లోకి? భోజనం చేసి ఇంట్లో కాస్త కునుకు తీద్దామని' రెప్ప వాలిస్తే వీడి నిర్వాకం ఇది." భార్యమణి కొట్టినట్లు సమాధానం చెప్పేనరికి ఆంజనేయులు నీరు కారిపోయి, నీళ్ళు నమిలేశాడు. ఆంజనేయులు దగ్గర పెళ్ళాం కెంత భయమో, ఒక్కొక్కసారి పెళ్ళాం హాంకరింపులకి ఆంజనేయులూ అంతే భయపడుతూ ఉంటాడు. నేల మీద పడి దొర్లుతున్న కొడుకును ఎత్తుకుని వూరడిస్తూ "అవునూ, మధ్యాహ్నం మనింటికెవరైనా వచ్చారా?" అని అడిగాడు.

"ఎవరొస్తారు?" అని భార్య వేసిన ఎదురు ప్రశ్న ఆంజనేయులకి నచ్చలేదు. మళ్ళీ అంతలోనే "ఆ.... వచ్చాడు" అని భార్య అనగానే వేయి ప్రశ్నలూ, సందేహాలుగా ఆంజనేయులి మనసులో ధనుస్సులై గుచ్చకోగా

"ఎవరూ?" అన్నాడు.

"చాక లొచ్చాడు..... మీరు లేరని తరువాత రమ్మన్నాను. కానీ వాడు మళ్ళీ వారం రోజులదాకా రావడానికి కుదరదంటే బట్టలన్నీ నేనే వేసి పద్దు రాశాను" అంది.

"ఛి ఛీ.... చాకలి వెధవ గురించి కాదు నే నడిగింది" అని ఇంకా ఏం అడగాలో తెలియక కొడుకునెత్తుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

ఆంజనేయులకి మనసు పీకుతూనే ఉంది. కొడుకును వీధి గుమ్మంలోనికి తీసికెళ్ళాడు. వూరడించాడు. గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

"నాన్నా.... ఇందాక రెండు నాన్నలన్నావు కదా? ఎవళ్లో చెప్పమ్మా?

నేనొక నాన్నా, ఇంకా?" భార్యకి వినిపించని మెల్లని స్వరంతో అడుగుతున్నాడు. అంతలో భార్య కాఫీ పట్టుకుని అక్కడికొచ్చింది. "వాడిని నా కివ్వండి. మీరు కాఫీ తీసుకోండి" అంది. సన్నివేశాన్ని చెడగొట్టి నందుకు భార్య వైపు కొరకొరా చేస్తూ, కాఫీ కప్పు నందుకుని మంచి నీళ్ళలా గుటగుటా త్రాగబోయి, నోరు చురుక్కు మనటంతో తమాయించకొని కాఫీ త్రాగటం పూర్తి చేశాడు.

"వాడినిలా...ఇయ్యి... అలా వీధిలోనికి వెళ్ళి వస్తా!" అన్నాడు.

"వాడినెక్కడికండీ? వాడి జుట్టూ, ఆ వాటం చూస్తే ఎవరైనా నవ్వుతారు,"

"ఏం ఫర్వాలేదులే!"

"అయ్యో! మరీ బాగుందండీ! ఉండండి! ఆ చొక్కా అయినా మారుస్తాను" అని గబగబా ఇంటోకెళ్ళి ఇస్త్రీ బుష్కోటూ, నిక్కరు తొడిగి చీరకొంగుతో వాడిని పూర్తిగా దులిపి, కాస్త పౌడర్ను ముఖానికి అద్దింది.

వరండాలో సైకిల్ని తీసి ముందున్న చిన్న సీటు మీద కొడుకును కూర్చో బెట్టి సైకిల్ని పార్కుకి పోనిచ్చాడు. ఎప్పుడైనా కొడుకు ఏడిస్తే సైకిలు మీదోసారి తిప్పి తీసుకు రండి' అని భార్య అంటే కసురుకునే ఆంజనేయులు, ఈ రోజు భార్య వద్దంటున్నా తీసికెళ్ళటం రాధకి ఆశ్చర్యం కలిగించింది. అలా చూస్తూ ఉండి పోయింది. తిక్క మనిషని మనసులో అనుకుంది.

ఇక్కడ ఆంజనేయులు గురించి మీరు

తెలుసుకోవలసిందీ, నేను చెప్పవలసిందీ కొంత ఉంది, లేకపోతే నేను రాస్తున్నదీ, మీరు చదివేది ఎక్కడైనా అరుగుతుందా? అనుకునే ప్రమాదం ఉంది.

ఆంజనేయులు ఆడవాళ్ళకి నిజాయితీ ఉంటుందంటే నమ్మడు. "ఆడవాళ్ళు అబద్ధాల పుట్ట. అందుకే మనవాళ్ళు మొదట్నించీ ఆడవాళ్ళని వంట గుమ్మం దాటి వీధిలోకి రానివ్వలేదు అని కూడా వాదిస్తుంటాడు. ఎవరైనా ఆంజనేయులకి వ్యతిరేకంగా వాదిస్తే ఎప్పుడో చిన్నప్పుడు చదవుకొనే అల్లుని మంచితనంబును...." అనే సుమతీ శతక పద్యాన్ని ఉదహరిస్తుంటాడు. వీటికి తోడు ఆంజనేయులు మేనత్త ముప్పయ్యేళ్ళ వయసులో ఇద్దరు పిల్లల్ని వదిలేసి, పాతికేళ్ళ యువకుడితో లేచిపోవటం, ఆడవాళ్ళని నమ్మకూడదనే అతని నమ్మకానికి మరింత శక్తి నిచ్చింది. అందునుంచి ఆంజనేయులులో ఆడవాళ్ళని నమ్మకూడదు అనే భావం కాంక్రీటు అయింది.

అందువల్లనే-

ఆఫీసుకు వెళ్ళి పని చేస్తుంటాడే గాని ఇంటి దగ్గర ఏం జరుగుతున్నదో అనే బెంగ ఒక మూల అతన్ని కెలుకుతూనే ఉంటుంది. అప్పటికీ ఏదో వస్తువు మరిచిపోయాననో లేక తలనొప్పిగా ఉందనో ఇంటికెళ్ళి వస్తూనే ఉంటాడు. మొదట్లో అందరూ "పెళ్ళాన్నొదలి ఉండలేక పోతున్నాడు కాబోలు గురుడు" అని అనుకున్నప్పటికీ, తరువాత్తరువాత ఆంజనేయ శాస్త్రి అంతర్యాన్ని గ్రహించిన కో వర్కర్సు చప్ప చప్పగా చివాట్లేయడంతో, కొంతలో కొంత ఆఫీసవర్లలో ఇంటికెల్లే కార్యక్రమాన్ని తగ్గించాడు.

అంతేకాదు-

తన భార్యతను లేకుండా పుట్టింటికి వెళ్ళకూడదు. తను లేనప్పుడు ఇరుగు పొరుగు (ఆడ) వాళ్ళతో (కూడా) మాట్లాడకూడదు! ఇవి ఆంజనేయులు పెళ్ళానికి విధించిన రూల్సు!

ఈ కట్టుదిట్టాలూ, నిబంధనలూ మొదట్లో ఇవడక భార్య నానా బాధలూ పడిపోయేది. కానీ ఇక ఈ జీవితం ఇత గాడి(ద) చేతుల్లో నలిగిపోవాల్సిందే! ఆ భగవంతు డెలా రాస్తే అలా జరక్కతప్పదు అనుకునే సమయంలో ఆవిడ నెల తప్పడం కొడుకు పుట్టడం కొంత ఉపశమనాన్ని కలిగించాయి.

ఇప్పుడు మీరే ఆలోచించండి!

ఇలాటి ఆంజనేయ శాస్త్రి మనసులో ఎలాటి ఆలోచనలు ప్రకోపిస్తాయో?

పార్కు జనసమ్మర్ధంగా ఉంది

ఒక మూల ఒక సిమెంట్ బెంచీ మీద మనుషులెవరూ కనిపించలేదు. అక్కడికి పోయి సైకిలుకు స్టాండు వేసి బెంచీ మీద కూర్చున్నారు.

"నాన్నగాడూ.... ఇందాకల... రెండు న్నాలు అన్నావుకదా! మరి నేనో నాన్నని. ఇంకో నాన్నెవరమ్మా" అంటూండగా,

"అయినండీ అయినం. నీలివూ అయిసు కావాలా బాబూ?" అనేసరికి, "అక్కర్లేదు వెళ్ళవయ్యా!" అని కసురు కున్నాడు.

అయిసువాడికీ కోపం వచ్చినట్లుంది.

"ఏంటండీ మిమ్మల్ని కొనమని మేం బతిమాల్తున్నామా ఇపుడు! లేకపోతే మీరు కొంటేనేగాని బతుకులు ఎల్లపనుకన్నారా?" గదమాయించాడు.

"ఆ...అ....నా కయిసు తావాలీ. అయిసు తావాలీ." కొడుకు గునిశాడు. ఆంజనేయులుకి గొంతులో వెలక్కాయ పడినట్టయిది. తప్పలేదు.

"ఆ... చాల్లేగానీ!వో పావలాదివ్వు" అన్నాడు.

"పావలా కివ్వరండి! అర్ధకీ రూపాయకే!"

"సర్లే! అర్ధ రూపాయికే ఇచ్చుకో" అని వాడి దగ్గర అర్ధరూపాయి అయిసు తీసుకుని, మెల్ల మెల్లగా కొడుకు చేత తినిపిస్తూ

"నాన్న! చెప్పమ్మా! నేనొక నాన్నని! మరి ఇంకో నాన్నెవరమ్మా?"

వాడు తండ్రి మాటల్ని లెక్క చెయ్య కుండా అయిసు తినడంలో నిమగ్నం అయిపోయాడు.

ఆంజనేయులకి చిరాకేసింది. ఒక్కటిచ్చుకోవా లనుకున్నాడు. కానీ వాన్నేవన్నా అంటే, తన ప్రశ్నకు జవాబు దొరకదని ఎక్కడలేని వోర్మినీ తెచ్చుకున్నాడు. అయిసు తినేయటం పూర్తయిన తరువాత వాణ్ణి ఒడిలో కూర్చోపెట్టుకుని.

"బాబూ... అమ్మేదిరా?" అడిగాడు

"ఇంతి దద్దిలుంది."

"మరి నాన్నో?"

"నువ్వే... " అని నవ్వుతూ తండ్రి బుగ్గ మీద అయిసుతో గుచ్చాడు.

"వెధవ!" నవ్వుతూ "సరే మరింకో నాన్నెవరమ్మా?" ఆ ప్రశ్న వేసినపుడు అంజనేయులుకి కొడుకు నుండి ఏ జవాబు వినాల్సి వస్తుందో నన్న గుండె పీకు లేకపోలేదు.

"ఇదిగో...." అని ఎదురుగా చేయి చూపాడు. తలెత్తి చూసేసరికి ఆంజనేయులకు పీక తీసినంత పనయింది. ఎదురుగా చింకి బట్టలతో చింపిరి జుట్టుతో, తలెత్తితే చెయ్యి చాచడానికి సిద్ధంగా ఉన్న బిచ్చగాడు.

ఆంజనేయులకి ఒళ్ళమండింది. "చత్ వెధవ" అని వీపు మీద ఒక్క దరువు వేశాడు. అప్పుడు వాడు తీసిన రాగం అపుడే కూస్తున్న సైరన్‌తో కలిసిపోయింది. వాడిని వోదార్చేసరికి తలప్రాణం తోకకు దిగినట్లయింది. అప్పుడే వచ్చిన మిఠాయి బండి దగ్గర ఒక లడ్డూ కొనిచ్చి వాడి నోరు మూయించాడు. ఆ తరువాత ఎన్ని విధాలో ప్రయత్నించాడు. కానీ ఆ రెండో నాన్న గురించి వాడి ద్వారా తెలుసుకోలేక పోయాడు. గత్యంతరం లేక ఇంటివైపు దారి తీశాడు.

దారి పొడువునా ఆంజనేయ శాస్త్రికి సందేహాలే!

ఆంజనేయులి పెళ్ళానికి స్వయాన మేనత్త కొడుకొకడు ఈ వూర్లోనే స్టేట్ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. మొదట ఆంజనేయుల పెళ్ళాన్ని అతనికే ఇవ్వాలనుకున్నారట. కానీ వాళ్ళడిగిన కట్నం వీళ్ళివ్వకపోవటాన్న ఆ సంబంధం తప్పిపోయింది. ఈ విషయం ఆంజనేయుల పెళ్ళామే అతని తో ఒకసారి చెప్పింది.

అతనుగానీ రాలేదు కదా?

తమకు తెలియకుండా ఏ భాగోతం జరిగిపోలేదు కదా? ఆ మధ్య వాళ్ళ పెదనాన్న పోయాడని చెప్పటానికి ఆ కుర్రాడు వచ్చాడు కూడాను.!

ఆంజనేయ శాస్త్రి బుర్ర వేడిక్కిపోయింది. బాగా కోపం వచ్చేసింది. పెళ్ళాం మీదా, కొడుకు మీదా కో-వర్కర్స్ మీద, చుట్టూ ఉన్న మనుషుల మీదా, సైకిలుకి అడ్డం వస్తూన్న ఎడ్ల బండి మీదా అందరిమీదా ఆంజనేయులు కోపం వరద గోదారిలా ప్రవహించింది.

ఆకోపంతోనే ఇంటకి చేరుకున్నాడు.

"దిగరా!" ఒక చేత్తోనే వాడి రెక్క పుచ్చుకొని కిందికి కుదేశాడు. ఎదురుగా వచ్చిన భార్య కొడుకు నందుకుని "ఎక్కడి కెళ్ళారమ్మా" అని ఎత్తుకుని ముద్దాడింది.

ఆంజనేయులు రెండు చేతుల్నీ తల వెనుకకు అన్ని సోఫా మీద చేరబడ్డాడు. "ఎక్కడికి తీసికెళ్ళారండీ?" అంటూ భార్య అతని ప్రక్కనే వచ్చి కూర్చుంది.

భార్య ఒళ్ళో కూర్చున్న కొడుకు! "అదీ.... అదీ.... లెండు నాన్నలు! లెండు అమ్మలు!" అని చప్పట్లు కొట్టాడు ఎదురుగా పగిలి ఉన్న నిలువుటద్దం వైపు చూపెడుతూ.

అంతే! పగిలి ఉన్న అద్దంలో రెండుగా చీలిన తన రూపాన్ని చూసుకున్న ఆంజనేయులి ముఖం మాడిపోయింది. 'వెధవ ఎంత తుఫాను సృష్టించావురా!" అని గొణుక్కున్నాడు.

అప్పుడు గుర్తొచ్చింది 'బ్లాకులో తీసిన సినిమా టికెట్లు సంగతి'.

టైం చూసుకుంటే ఎనిమిదయింది!